
జిల్లా వ్యవసాయాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి, రామకృష్ణ

కౌంటింగ్ విధులు బాధ్యతతో చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎన్నికల కమిషన్ గైడ్‌లైన్స్ ప్రకారం కౌంటింగ్ విధులను బాధ్యతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ నిర్వహణ విధులను కేటాయించిన జిల్లా అధికారులతో డాక్టర్ జి.సృజన సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించారని ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బంది అందరికీ కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.. అదే నిబద్ధతతో జూన్ 4న జరగనున్న కౌంటింగ్ విధులను కూడా మరింత బాధ్యతతో నిర్వర్తించాలన్నారు. కౌంటింగ్ రోజున ఏర్పాట్లను ఏ విధంగా చేయాలనే అంశాలు రిటర్నింగ్ అధికారులు వద్ద ఉన్న హ్యాండ్ బుక్ లోని కౌంటింగ్ చాప్టర్‌లో ఉన్నాయని, చాప్టర్‌ను ఆర్‌ఒలు, ఎఆర్‌ఒలు కనీసం 10 సార్లు చదివి అర్థం చేసుకోవాలని సంబంధిత రిటర్నింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కౌంటింగ్ రోజున ఇవిఎం, పోస్టల్ బ్యాలెట్ లను ప్రొసీజర్ ప్రకారం కౌంటింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. పార్లమెంట్‌కు సంబంధించిన ఇవిఎం కౌంటింగ్ ఒక రూమ్‌లో, అసెంబ్లీకి సంబంధించిన ఇవిఎం కౌంటింగ్ ఒక రూమ్ లో చేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి కౌంటింగ్ హాల్‌లో 14 కౌంటింగ్ టేబుల్స్, 1 రిటర్నింగ్ అధికారి టేబుల్ ఉంటుందన్నారు. 14 టేబుళ్లలో ఒక టేబులుపై మెష్‌ఎంక్లోజర్‌తో కూడిన వివిప్యాట్ కౌంటింగ్ బూత్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రిటర్నింగ్ అధికారులతో సమన్వయం చేసుకుని వివిప్యాట్ కౌంటింగ్ బూత్ ఏర్పాటు చేసే పనులు రేపటి నుండి మొదలు పెట్టాలని ఇరిగేషన్, ఆర్ అండ్ బి, టిడ్కో ఎస్ఇలను కలెక్టర్ ఆదేశించారు.. కౌంటింగ్ హాళ్లో టేబుల్స్, మంచి చైర్లు ఏర్పాటు వారం రోజుల్లోపు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వాటితో పాటు కౌంటింగ్ హాలులో కౌంటింగ్ టేబుల్, రిటర్నింగ్ అధికారి టేబుల్, అబ్జర్వర్ టేబుల్, ఇటిపిబిఎస్ టేబుల్ ఏ విధంగా ఏర్పాటు చేసుకోవాలనే దాని మీద కూడా 3 రోజుల్లో లే అవుట్ సిద్ధం చేసుకోవాలన్నారు. కౌంటింగ్ సిబ్బందికి, కౌంటింగ్ ఏజెంట్లకు కౌంటింగ్ హాల్ లోపలికి ఫోన్లు అనుమతించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి కౌంటింగ్ హాల్ వద్ద ఒక మొబైల్ డిపాజిట్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ హాల్లో చివరిగా కూర్చునే ఏజెంట్లకు కన్పించే విధంగా పెద్ద బ్లాక్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. బ్లాక్ బోర్డులలో క్రమ సంఖ్య, అభ్యర్థుల పేర్లు, రౌండ్లు అనే కాలమ్స్ కూడా మే 23వ తేది నాటికి తయారు చేసుకోవాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుండి ఇవిఎమ్ మెషీన్‌లను కౌంటింగ్ హాల్ కి తీసుకొని వచ్చే సమయంలో జాగ్రత్తగా ఉండడంతో పాటు తీసుకొని వచ్చే ప్రక్రియ మొత్తం సిసి కెమెరాలో స్పష్టంగా రికార్డ్ అయ్యే విధంగా ఉండాలన్నారు. ప్రతి టేబుల్ కు ఒక కౌంటింగ్ ఏజెంట్ ప్రకారం అభ్యర్థులు సూచించిన వారిని ఆర్‌ఒలు నియమించాలన్నారు. వారికి ఫోటో ఐడెంటిటీ కార్డులు ఇవ్వాలని, ఏ టేబుల్‌కు ఐతే కౌంటింగ్ ఏజెంట్ నియమించి ఉంటారో ఆ టేబుల్ వద్దనే వారు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రిలీవింగ్ ఏజెంట్స్ ఉండరని కలెక్టర్ స్పష్టం చేశారు. మీడియా సెంటర్‌లో కౌంటింగ్ ప్రక్రియ కనిపించే విధంగా స్క్రీన్ ఏర్పాటు చేస్తామని,కంప్యూటర్, ఇంటర్నెట్, ప్రింటర్ సదుపాయాలు కల్పించడంతో పాటు టివిలను కూడా ఏర్పాటు చేసుకోవాలని సమాచార శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. కౌంటింగ్ రోజున విధులు నిర్వహించే సిబ్బందికి, కౌంటింగ్ ఏజెంట్లలకు భోజనాలు ప్యాకింగ్ చేసి లోపలే ఇవ్వడం జరుగుతుందన్నారు. పోలీస్, ఇతర సిబ్బందికి భోజనాలు బయట ఏర్పాటుచేయాలన్నారు. ట్రెజరీ స్ట్రాంగ్ రూములలో భద్రపరిచిన పోస్టల్ బ్యాలెట్‌లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కౌంటింగ్‌కు 24 గంటల ముందుగా క్లోజ్డ్ వెహికల్‌లో ట్రాన్స్‌పోర్ట్ ద్వారా యూనివర్సిటీ వద్దకు తీసుకొచ్చి రూంలో భద్రపరచాలన్నారు. రిటర్నింగ్ అధికారులకు సహకారం అందించేందుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక జిల్లా అధికారిని నియమించామని, ఆయా జిల్లా అధికారులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. పాణ్యం రిటర్నింగ్ అధికారి, జెసి నారపురెడ్డి మౌర్య, కర్నూలు రిటర్నింగ్ అధికారి భార్గవ్ తేజ, ఆదోని రిటర్నింగ్ అధికారి శివ్ నారాయణ్ శర్మ,అదనపు ఎస్పీ నాగరాజు, కోడుమూరు రిటర్నింగ్ అధికారి, కర్నూలు ఆర్‌డిఒ శేషి రెడ్డి, పత్తికొండ రిటర్నింగ్ అధికారి రామలక్ష్మి, ఎమ్మిగనూరు రిటర్నింగ్ అధికారి చిరంజీవి, మంత్రాలయం రిటర్నింగ్ అధికారి మురళి, ఆలూరు రిటర్నింగ్ అధికారి రామునాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

కల్తీ విత్తనాల నుంచి రైతులను కాపాడాలి

- నాణ్యమైన విత్తనాన్ని, ఎరువులను అందించాలి
- వ్యవసాయ అధికారికి ఎపి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

జిల్లా రైతాంగానికి నాణ్యమైన విత్తనాన్ని అందించాలని , పత్తి, ఆముదం, మిరప, కంది, మొక్కజొన్న వంటి విత్తనాలను సబ్సిడీతో రైతులకు సరఫరా చేయాలని కోరుతూ శనివారం వ్యవసాయ శాఖ జిల్లా అధికారి పిఎల్. వరలక్ష్మికి ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుందని, ముందస్తు వర్షాలతో జిల్లాలో రైతులు పత్తి, వేరుశనగ, మిరప, ఆముదం, మొక్కజొన్న, కంది వంటి పంటలను సాగు చేసేందుకు సిద్ధం అవుతున్నారన్నారు. గత రెండు సంవత్సరాల్లో కావేరి జాదు , కొన్ని విత్తన కంపెనీలు సరఫరా చేసిన కల్తీ విత్తనాలతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారన్నారు. 2021 ఖరీఫ్‌లో కావేరి జాదు విత్తన కంపెనీ చేతిలో నష్టపోయిన 1,899 మంది రైతులకు పంట నష్టపరిహారానికి సంబంధించి అప్పటి జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులు ఇప్పటికీ అమలు కాలేదన్నారు. రైతులు రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదన్నారు. గత సంవత్సరం వర్షాభావ పరిస్థితుల వల్ల 30 నుండి 40 శాతం మేర పంటలు సాగు కాలేదన్నారు. రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారన్నారు. ఈ సంవత్సరం ముందస్తు వర్షాలతో ఖరీఫ్ ఆశాజనకంగా ఉండే అవకాశం ఉందని, ఉమ్మడి కర్నూలు జిల్లాలో పత్తి, వేరుశనగ, వరి, ఆముదం, మొక్కజొన్న, మిరప, కంది వంటి పంటలు ప్రధానంగా సాగు చేస్తారని, వేరుశనగ, జీలుగ, పిల్లిపెసర వంటి విత్తనాలను సబ్సిడీతో రైతులకు సరఫరా చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలను సబ్సిడీతో సరఫరా చేయాలన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2.60 లక్షల హెక్టార్లకు పైగా పత్తి సాగు చేస్తారని, వేరుశనగ 60 వేల హెక్టార్లు, కంది 25 వేల హెక్టార్లు, మిరప 30 వేల హెక్టార్లు, ఉల్లి 16 వేల హెక్టర్లు, మొక్కజొన్న 9 వేల హెక్టార్లు సాగు అయ్యే అవకాశం ఉందన్నారు. జిల్లాలో ప్రధాన పంటగా ఉన్న పత్తి, మిరప, కంది, మొక్కజొన్న, ఆముదం వంటి విత్తనాలను సబ్సిడీతో సరఫరా చేయడం వలన రైతులకు ప్రయోజనకరంగాఉంటుందన్నారు. జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం అధికంగా ఉండటంతో పత్తి విత్తన కంపెనీలు నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టి మోసం చేసే అవకాశం ఉందని, వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తమై విత్తనాల షాపులు, విత్తన కంపెనీల గోడౌన్‌లు తనిఖీ చేసి నకిలీ విత్తనాలను అరికట్టాలన్నారు. మోసాలకు పాల్పడుతున్న విత్తన కంపెనీలు, విత్తన షాపులపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. పత్తి సాగు పట్ల రైతులలో ఉన్న ఆసక్తిని అవకాశంగా తీసుకుని విత్తనాల షాపుల యజమానులు నిర్ణయించిన గరిష్ట ధరల కంటే అదనపు ధరలకు రైతులకు విత్తనాలను అమ్ముతున్నారని, ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు పట్టణాల్లో కొన్ని దుకాణాల యజమానులు ఈ రకమైన అక్రమాలకు పాల్పడుతున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించి అక్రమాలను అరికట్టి రైతులకు అండగా నిలవాల్సిందిగా కోరుతున్నామన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లపై నిరంతరం

నిఘా ఉంచండి : కలెక్టర్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములపై నిరంతరం నిఘాను ఉంచడంతో పాటు కౌంటింగ్ ప్రక్రియకు అవసరమైన భద్రతాపరమైన ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. శనివారం రాయలసీమ యూనివర్సిటీలోని కంట్రోల్ రూంలో స్ట్రాంగ్ రూమ్‌ల లైవ్ ఫీడ్ ను పరిశీలించిన అనంతరం ఇవిఎమ్ స్ట్రాంగ్ రూమ్లు, కౌంటింగ్ ఏర్పాట్లు, మీడియా సెంటర్ ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ముందుగా ఇంజనీరింగ్ బ్లాక్, లైబ్రరీ విభాగంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్లను పరిశీలించి సంబంధింత రిజిస్టర్లలో సంతకాలు చేశారు. అనంతరం లైబ్రరీ బ్లాక్ లోని పత్తికొండ, మంత్రాలయం నియోజకవర్గానికి సంబంధించి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను పరిశీలించి స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ కోసం బయటికి తెచ్చే ఇవిఎంలను భద్రతా నిమిత్తం ప్రత్యేక గ్యాంగ్ వే తరహాలో బ్యారికేడింగ్ ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకోవాలని జిలా ఎస్పి సంబంధిత నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పి జి.కృష్ణకాంత్, పత్తికొండ రిటర్నింగ్ అధికారి రామలక్ష్మి, మంత్రాలయం రిటర్నింగ్ అధికారి మురళీ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూములను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

పెరిగిన పోలింగ్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా గత ఎన్నికలతో పోలిస్తే 7 అసెంబ్లీ స్థానాల్లో పోలింగ్ శాతం పెరిగింది. మరో 7 అసెంబ్లీ స్థానాల్లో కొంత మేర తగ్గుదల కనిపించింది. గతేడాది ఉమ్మడి కర్నూలు జిల్లాలో 78.38 శాతం పోలింగ్ నమోదు కాగా ఈసారి కర్నూలు జిల్లాలో 76.42 శాతం, నంద్యాలలో 81.12 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కర్నూలు జిల్లావ్యాప్తంగా 20,54,563 మంది ఓటర్లు ఉండగా 15,70,007 మంది ఓటు వేశారు. నంద్యాల జిల్లావ్యాప్తంగా 13,72,091 మంది మొత్తం ఓటర్లు ఉండగా 11,13,040 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత ఎన్నికల్లో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 83.96 శాతం, శ్రీశైలం నియోజకవర్గంలో 82.43 శాతం, నందికొట్కూరు నియోజకవర్గంలో 87.25 శాతం, కర్నూలు నియోజకవర్గంలో 58.96 శాతం, పాణ్యం నియోజకవర్గంలో 74.81, నంద్యాల నియోజకవర్గంలో 76.83, బనగానపల్లె నియోజకవర్గంలో 83.42 శాతం పోలింగ్ నమోదయింది. డోన్ నియోజకవర్గంలో 79.30 శాతం, పత్తికొండ నియోజకవర్గంలో 81.57, కోడుమూరు నియోజకవర్గంలో 77.68, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 79.65, మంత్రాలయం నియోజకవర్గంలో 85.18, ఆదోని నియోజకవర్గంలో 65.47, ఆలూరు నియోజకవర్గంలో 80.11 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 83.12 శాతం, శ్రీశైలం నియోజకవర్గంలో 81.70 శాతం, నందికొట్కూరు నియోజకవర్గంలో 81.69 శాతం, కర్నూలు నియోజకవర్గంలో 63.75 శాతం, పాణ్యం నియోజకవర్గంలో 74.44, నంద్యాల నియోజకవర్గంలో 75.00, బనగానపల్లె నియోజకవర్గంలో 82.29 శాతం పోలింగ్ నమోదయింది. డోన్ నియోజకవర్గంలో 82.91 శాతం, పత్తికొండ నియోజకవర్గంలో 84.98, కోడుమూరు నియోజకవర్గంలో 79.14, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 81.97, మంత్రాలయం నియోజకవర్గంలో 84.31, ఆదోని నియోజకవర్గంలో 66.55, ఆలూరు నియోజకవర్గంలో 80.73 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే పాణ్యం, మంత్రాలయం, ఆళ్లగడ్డ, శ్రీశైలం, నందికొట్కూరు, నంద్యాల, బనగానపల్లె నియోజకవర్గాల్లో కొంత మేర పోలింగ్ శాతం తగ్గింది. మిగిలిన ఏడు నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెరిగింది.

6 నుంచే బారులు..

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉదయం 6 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున బారులుతీరారు. జిల్లా వ్యాప్తంగా తెల్లవారుజామున వర్షం కురవడంతో వాతావరణం ఓటర్లకు అనుకూలించింది. దీంతో పోలింగ్ ప్రక్రియ ప్రారంభానికి ముందే ఓటర్లు భారీ ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. పోలింగ్ కేంద్రాల వద్ద 200 మీటర్ల లోపు జనం గుంపులు గుంపులుగా ఉండకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ ప్రారంభమయ్యే సమయానికే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలు ఓటర్లతో కిక్కిరిసి కనిపించాయి. ఆ తరువాత నుంచి పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య పెరుగుతూ కనిపించింది. పోలింగ్ ప్రారంభంలోనే పలు ప్రాంతాల్లో ఇవిఎంలు మొరాయించడంతో ఓటర్లు గంటల తరబడి క్యూలైన్‌లో వేచి చూడాల్సి వచ్చింది. మధ్యాహ్నం నుంచి ఎండ వేడిమి కనిపించినా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల సంఖ్య తగ్గలేదు. ఎండ వేడిమిని సైతం లెక్కచేయకుండా ఓటర్లు క్యూలైన్లలో బారులు తీరారు. పోలింగ్ కేంద్రాల్లో మధ్య మధ్యలో అభ్యర్థులు పోలింగ్ సరళిని పరిశీలించారు. అక్కడక్కడ కొద్ది పాటి ఉద్రిక్త వాతావరణం కనిపించింది. పోలీసులు జోక్యం చేసుకోవడంతో పరిస్థితి చక్కబడింది. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ సమయం ముగిసేటప్పటికి ఓటర్లు క్యూలైన్లలో బారులు తీరారు. ఆ సమయానికి క్యూలైన్‌లో ఉన్న వారందిరికీ ఓటు వేసేందుకు పోలింగ్ అధికారులు అవకాశం కల్పించారు.

ముళ్ల కంపతో మూసుకుపోతున్న రోడ్డు

ఎదురుదురుగా రెండు వాహనాలు వస్తే ఇబ్బందే
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- సి బెళగల్

పాలకుల నిర్లక్ష్యంతో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. ఇసుక వాహనాలతో అటు ఏటి గడ్డకు లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు ఎక్కువగా తిరగడంతో రోడ్ల ఆనవాళ్లు మారిపోయాయి. ఇటు సి బెళగల్ ఎగువకు రోడ్ల పురోగతి అతి గతి లేకుండా పోయింది. ఇందుకు నిదర్శనం మండలంలో అనేకం వెలుగు చూస్తున్నా పట్టని పాపానికి ప్రజలు, వాహన దారులు పాట్లు పడుతున్నారు. ఇదే గొల్లలదొడ్డిరోడ్డుకు ఇరువైపులా ముళ్ల కంప చెట్లు విస్తరించి ఉన్నాయి. పట్టించుకోని కారణంగా అవీ రోడ్డుకిరువైపులా ఉన్న స్థలాన్ని ఆక్రమించి మూసుకొని వస్తున్నాయి. ఇక్కడే వాహన దారులు వెళ్తున్నప్పుడు గాలులకు ముళ్ల కంప కొమ్మలు కళ్ళకు తగులుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఆ కంప ముళ్ళు వాహనాల కింద పడుతూ పంచర్లు అవుతున్నాయి. మలుపులు ఉన్న చోట ఎదురుగా వచ్చే వాహనాలు అసలు కనిపించని సందర్భాన ప్రమాదాలు జరగక తప్పడం లేదు. అదే ఎదురెదురుగా రెండు వాహనాలు సజావుగా వెళ్ళుటకు తగినంత స్థలం లేక పాట్లు పడుతున్నారు. అధికారులు, నాయకులు కనీసం పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా మండలంలో రోడ్ల పురోగతిపై తగు శ్రద్ధ చూపి ముళ్లకంపలను తొలగించాలని, రోడ్లను బాగుచేయాలని వాహనదారులు కోరుతున్నారు.


దాడులలో పోలీసులు స్వాధీనం చేసుకున్న బెల్లం ఊట , ఇతర సామగ్రి

నాటుసారా స్థావరాలపై సెబ్ విస్తృత దాడులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

నాటు సారస్థావరాలపై విస్తృతంగా దాడులు నిర్వహించినట్లు కర్నూలు సెబ్ సిఐ రాజేంద్ర ప్రసాద్ శనివారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. కర్నూలు సెబ్ పోలీస్‌లు శనివారం కొల్లంపల్లితండా పరిసర ప్రాంతాల్లోని నాటు సారా స్థావరాలపై దాడి చేసి 2500 లీటర్ల నాటు సారా తయారీకి సిద్ధంగా ఉన్న బెల్లపు ఊటను, ధ్వంసం చేసి కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ దాడుల్లో డిటిఎఫ్. ఇన్‌స్పెక్టర్ నరసనాయుడు, సిబ్బంది పాల్గొన్నట్లు కర్నూలు సెబ్ సిఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

ఆర్‌టిసి యూనియన్ నాయకుల అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలి

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎపిఎస్‌ఆర్‌టిసిలో పని చేస్తున్న యూనియన్ రాష్ట్ర నాయకులను సస్పెండ్ చేయడాన్ని సిఐటియు కర్నూలు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. అక్రమ సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తి వేయాలని డిమాండ్ చేసింది. సిఐటియు జిల్లా కమిటీ అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన కార్మిక కర్షక భవన్‌లో జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు మాట్లాడుతూ ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ .సుందర రావు, బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యాంశాన్, ఎన్ఎంయు తణుకు డిపో కార్యదర్శి సుబ్బారావులపై విధించిన సస్పెన్షన్ అక్రమమైనదని అన్నారు. తక్షణమే సస్పెన్షన్ను ఎత్తివేయాలని కోరారు. ఉద్యోగ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొనడం చట్ట విరుద్ధం ఏమి కాదని, రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారనే నెపంతో సస్పెన్షన్ చేయడం సరైనది కాదని అన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఫిర్యాదు లేకున్నా కక్షపూరితమైన చర్యలు తీసు కున్నారని అన్నారు. ఆర్‌టిసి యాజమాన్యం ఉద్యోగుల పట్ల కక్షపూ రితంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఈ మధ్యకాలంలో 146 మందిని అక్రమంగా సస్పెండ్ చేయడంతో పాటు 26 మందికి ఇంక్రిమెంట్లను నిలిపి వేసిందని అన్నారు. ఆందోళన తప్పదని తెలిపారు .

మాట్లాడుతున్న ఎండి.అంజిబాబు

సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

మే 30న సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని జిల్లా కమిటీ సిఐటియు కార్యకర్తలకు పిలుపునిచ్చింది. జెండావిష్కరణలు జరిపి సభలు నిర్వహించాలని కోరింది.అలాగే జూన్ 8న సిఐటియు వ్యవస్థాపక నాయకులు పర్సాసత్యనారాయణ శత జయంతి సభ నిర్వహించాలని జిల్లా కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. కెకెభవన్లో జరిగే ఈ సభకు రాష్ట్ర నాయకులు హాజరవుతారని ఈ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు సాయిబాబా, విజయ్, గోపాల్, ప్రభాకర్, జె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా అధ్యక్షురాలుకు పుత్ర వియోగం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా వైసిపి అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ గడ్డం రామకృష్ణ దంపతులకు పుత్రవియోగం కలిగింది. వారి రెండవ కుమారుడు అయిన సిట్ర చిరంజీవి (38) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నవంబర్‌లో అతనికి గుండెకు సంబంధించి స్టంట్ వేశారు. 25వ వార్డు ఇన్‌ఛార్జిగా కూడా ఆయన వ్యవహరిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన ఎన్నికలలో పార్టీ తరపున అవిరామంగా పనిచేయడంతో ఒత్తిడికి లోనై అస్వస్థకు గురవడంతో ఈ నెల 14న నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరినట్లు సమాచారం. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం తుది శ్వాసను విడిచారు. శనివారం ఆయన అంత్యక్రియలు ముగిశాయి. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. పలువురు వైసిపి ప్రముఖులు ఆయన మృతికి సంతాపాన్ని ప్రకటించి కుటుంబానికి అనుభూతిని తెలిపారు.

చిరంజీవి(ఫైల్‌ఫొటో)
భౌతికకాయం వద్ద నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

టిఎస్ ఎంసెట్ ఫలితాల్లో 'నారాయణ ప్రతిభ'

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టర్

తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో మరోసారి కర్నూలు నారాయణ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. టి.ఫణిధర్ రెడ్డి 63 ర్యాంకు, పి. మహమ్మద్ ఇర్ఫాన్ 95 ర్యాంకు, ఎమ్.షేక్ సానియా అఫ్రా 174 ర్యాంకు, కె. తన్మయి 318 ర్యాంకు, కె. ఐశ్వర్య వర్మ 346 ర్యాంకు, ఎస్. సుమయ 347 ర్యాంకు, షేక్. అమన్ రియాద్ 373 ర్యాంకు, తేజస్ సాయి 400 ర్యాంకు, ఎన్. భావికా రెడ్డి 404 ర్యాంకు, ఎమ్. అఖిల 407 ర్యాంకు, సి. రేఖస్రవంతి 408 ర్యాంకు, జి. వైష్ణవి 409 ర్యాంకు, వై. హర్షిణి 421 ర్యాంకు, జి. గౌతమి వెంకట్ 499 ర్యాంకు, డి.హరిణి 501 ర్యాంకు, జె. మృధులకు 582 ర్యాంకు వచ్చాయి. 5000 లోపు 83 మంది, 10,000 లోపు 112 మందికి ర్యాంకులు వచ్చాయి. ఇంజనీరింగ్ విభాగంలో షాహెద్లిఖాన్ 240 ర్యాంకు, ఎస్.సాకేత్ రామ్ 292 ర్యాంకు, బి. వేదవ్యాస్ 489 ర్యాంకు, జి.సర్వజిత్ 878 ర్యాంకు, ఎస్.యూనస్ సాకిబ్ 1929 ర్యాంకులు వచ్చాయి. కళాశాల డిజిఎం టి. గోవర్ధన్ రెడ్డి, డీన్లు ఆంజనేయ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, నరసింహారావు, ప్రిన్స్‌పల్స్ వేణు గోపాల్ రెడ్డి, విజయ మోహన్, పి.సుజాత, హవీల ప్రసాద్, టి. కౌసల్య, జయరామి రెడ్డి, కృష్ణా రెడ్డి, ఎజిఎం అంజన్ కుమార్ రెడ్డి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో డిజిఎం, డీన్లు, ప్రిన్సిపల్స్

సెమిస్టర్ ప్రశ్నాపత్రంలో గందరగోళం

వర్సిటీ అధికారులపై విద్యార్థులు ఆగ్రహం

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న 2,4,6 సెమిస్టర్ పరీక్షల నిర్వహణలో వర్సిటీ అధికారులు విఫలమయ్యారు. డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ప్రశ్నాపత్రాల తయారీలో అనేక తప్పులు దొర్లాయి. డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షకు సంబంధించిన సంస్కృతం ప్రశ్న పత్రం తయారీలో గతంలో 20 సంవత్సరాల క్రితం సంబంధించిన ప్రశ్న పత్రం ఇచ్చారు. మళ్లీ తర్వాత పది సంవత్సరాల క్రితం సంబంధించిన ప్రశ్న పత్రాన్ని ఇచ్చారు. విద్యార్థులు ఈ ప్రశ్న పత్రాన్ని చూసి అక్కడ ఉన్న పరీక్షలు నిర్వాహకులను నిలదీశారు. పరీక్ష నిర్వాహకులు వెంటనే వర్సిటీ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వగా అప్పటికప్పుడు మళ్ళీ ప్రశ్నాపత్రాన్ని తయారుచేసి జిరాక్స్ పత్రాలను విద్యార్థులకు అందజేశారు. అసలు ప్రశ్న పత్రాల తయారీలో వర్సిటీ అధికారులు తీసుకున్న చర్యల పట్ల విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

11 మంది విద్యార్థులు డిబార్

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ పాల్పడుతూ 11 మంది విద్యార్థులను డిబార్ చేసినట్లు వర్సిటీ అధికారులు వెల్లడించారు. ఉదయం జరిగిన పరీక్షకు 90శాతం హాజరు నమోదు కాగా మధ్యాహ్నం పరీక్షకు 92శాతం హాజరు నమోదు అయినట్లు వర్సిటీ అధికారులు వెల్లడించారు.

అన్నదానం చేస్తున్న పార్థసారథి, తదితరులు

జొన్నగిరి దేవాలయంలో అన్నదానం

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామంలో నెల్లూరమ్మ, సవారమ్మ తదితర దేవాలయాల్లో ప్రముఖ పారిశ్రామికవేత్త జొన్నగిరి పార్థసారథి శనివారం ప్రజలందరికీ ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఆయన దేవాలయంలో దేవతలకు ప్రత్యేక పూజా కార్యక్రమం కుటుంబ సమేతంగా నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామం అందరికీ దేవాలయంలోని ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జొన్నగిరి కట్ట కింద ఉన్న నెల్లూరమ్మ దేవాలయంలో ప్రతి సంవత్సరం ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దేవాలయ అభివృద్ధికి కూడా తమ వంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పార్థసారథి కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు బాలన్న పాల్గొన్నారు.

వైసిపి నాయకునికి విరుపాక్షి పరామర్శ

ప్రజాశక్తి - ఆలూరు

ఆస్పత్రిలో కేశవరెడ్డిని పరామర్శిస్తున్న విరుపాక్షి

హైదారాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సొసైటీ మాజీ చైర్మన్, వైసిపి సీనియర్ నాయకులు చెన్నకేశవ రెడ్డిని శనివారం వైసిపి ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుసినే విరుపాక్షి పరామర్శించారు. గత పది రోజుల క్రితం బైక్ ప్రమాదంలో గాయపడిన చెన్నకేశవ రెడ్డి హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని విరుపాక్షి పరామర్శించారు. కేశవరెడ్డి వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పని చేసిన నాయకుడని విరుపాక్షి తెలిపారు. ఆస్పరి, ఆలూరు జడ్‌పిటిసిలు దొరబాబు, శేఖర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జనార్ధన్ నాయుడు పాల్గొన్నారు.

'అడిక్ట్' హీరో ప్రేమ్ రక్తదానం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రక్తదానం చేస్తున్న ప్రేమ్ (ఇమ్రాన్)

'అడిక్ట్' చిత్రం హీరో ప్రేమ్ (ఇమ్రాన్) ఓ చిన్నారికి శనివారం రక్తదానం చేసి నిజమైన హీరో అని నిరూపించుకున్నారు. హీరో ఇమ్రాన్ ఎమ్మిగనూరు వాసి. ఎమ్మిగనూరు బృందావనం అనే గ్రూపులో కర్నూలు విశ్వ భారతి ఆస్పత్రిలో వాసవి భరణ్య అనే చిన్నారికి 'బి' పాజిటివ్ రక్తం అవసరమని తెలిసింది. వెంటనే స్పందించి చిన్నారి కోసం కర్నూలు విశ్వ భారతి ఆస్పత్రిలో రక్తదానం చేశారు. రక్త దానం చేయడం ఒకరికి ప్రాణం కాపాడడంతో సమానం. ఇలా సినిమాల్లో నటించే హీరోలు ఉంటారు.. నిజ జీవితంలో నిజమైన హీరోగా సేవ చేయడం చాలా గొప్పదని ప్రజలు హీరో ఇమ్రాన్‌కు ప్రశంసించారు.

చంద్రబాబు సిఎం కావడం తథ్యం : టిడిపి

ప్రజాశక్తి - చిప్పగిరి

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి రావడం తథ్యమని, మళ్లీ చంద్రబాబు నాయుడు సిఎం అవుతారని టిడిపి మండల కన్వీనర్ లాయర్ షేక్షావలీ, టిడిపి సీనియర్ నాయకులు పాముల సన్నప్ప, సంగాల భాస్కర్, చంద్ర తెలిపారు. శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని విమర్శించారు. టిడిపితోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని, సూపర్ సిక్స్ పథకాలు మహిళలకు ఎక్కువ ఆకర్షించాయని, వారి ఓట్లన్నీ టిడిపికి వేశారని తెలిపారు. ఆలూరు నియోజకవర్గంలో వీరభద్ర గౌడ్ మంచి మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

సమయ వినియోగంపై వార్షిక సర్వే

ప్రజాశక్తి - పెద్దకడబూరు

సర్వే నిర్వహిస్తున్న అధికారులు

గ్రామీణ, పట్టణ బ్లాకులలో ఎంపిక చేసిన కుటుంబాలను సందర్శించి వ్యక్తుల సమయ వినియోగంపై సమాచారాన్ని సేకరిస్తున్నట్లు ఎఎస్ఒ, సర్వే మండల సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం పెద్దకడబూరు గ్రామంలో ఎన్ఎస్ఎస్ఒ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సర్వేలో ఆర్జిత, అనార్జిత కార్యకలాపాలకు సంబంధించిన సంరక్షణ, స్వచ్ఛంద సేవ, గృహ వినిమయ ఉత్పత్తి, సేవలు, వ్యక్తి అభివృద్ధి, విశ్రాంతి, స్వీయ సంరక్షణ, సామాజికీకరణ కోసం వ్యక్తులు పాల్గొంటున్న సమయ వ్యవధిపై సమాచారం సేకరించినట్లు తెలిపారు. సర్వే సూపర్‌వైజర్ సాంబశివుడు, సర్వే సిబ్బంది గోపాల్, విఆర్ఒ నరసప్ప, విఆర్ఎలు భీమన్న, హుస్సేని, హైమావతి పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధం

మంత్రాలయంలో లాడ్జీల నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారని పలువురు విమర్శిస్తున్నారు. భక్తుల రద్దీని ఆసరాగా చేసుకుని ఇష్టారాజ్యంగా బాడుగలు పెంచుతున్నట్లు తెలిసింది. వీటిపై స్పందించే వారే కరువయ్యారని పలువురు విమర్శిస్తున్నారు.

- లాడ్జీల నిర్మాణాలపై విమర్శలు - ఇష్టారాజ్యంగా బాడుగల పెంపు
- ఒక్కో గది నెలకు రూ.25 వేలు వసూలు
- లీజర్ల మధ్య పోటీ పెట్టి పబ్బం గడుపుకుంటున్న యజమానులు
- అధికారుల నిఘా లోపమే కారణం

0ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేట్ లాడ్జీల నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటిపై స్పందించే అధికారులు కరువయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాఘవేంద్ర స్వామి దర్శనార్థం మంత్రాలయం వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ గణనీయంగా పెరుగుతోంది. డబ్బు ఉన్న ప్రతి ఒక్కరూ చిన్న పాటి ఒక సెంటు స్థలంలో కూడా లాడ్జీల నిర్మాణాలు చేపట్టి లీజర్లకు లీజుకు ఇస్తున్నారు. ఇప్పటికే స్థానికంగా సుమారు వందకు పైగా లాడ్జీలు ఉన్నా, నిర్మాణాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. నిర్మాణాలు పూర్తయిన లాడ్జీలకు పంచాయతీ అనుమతులు ఉన్నాయి. అనుమతి కలిగిన లాడ్జీల సంఖ్య వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు. కరోనా వైరస్ వచ్చిన 2019 తర్వాత భక్తుల రాక పెరగడంతో లాడ్జీల యజమానులు ధరలు పెంచారు. లాడ్జీల్లో ఉన్న ఒక్కో గదికి అంత ఇస్తామని, ఇంత ఇస్తామని ఇతరుల పేర్లతో మైండ్ గేమ్ ఆడి లాడ్జీల యజమానులు లీజర్ల మధ్య పోటీ పెడుతున్నారు. ఒక్కో గదికి నెలకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు ఇచ్చే విధంగా ఒప్పందం కుదుర్చుకొని రూ.కోట్లు, రూ.లక్షల అడ్వాన్స్‌తో లీజర్లకు అప్పగించారు. అంటే ఒక్కో లాడ్జీలో ఎన్ని గదులు ఉంటే అన్ని రూ.20 వేల నుంచి రూ.25 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. లీజర్లు కూడా దాని ప్రకారమే అద్దెలు పెంచి భక్తులను దోచుకుంటున్నారు. సాధారణ రోజుల్లో లాడ్జీలను బట్టి, సౌకర్యాలను అనుసరించి రూ.300 మొదలుకుని రూ.500, రూ.1000, రూ.1500 వసూలు చేస్తుంటారు. భక్తుల రాక పెరిగిందంటే అమాంతంగా రూ.3 వేల నుంచి రూ.8 వేల వరకు పెంచి భక్తుల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ధరల పెరుగుదలపై ప్రశ్నిస్తే లాడ్జీల యజమానుల ధరలు పెంచడం వల్ల తమకు కూడా తప్పడం లేదని, అయినా సాధారణ రోజుల్లో ఇబ్బందులు పడుతున్నామని, రాత్రి, పగలు కష్టపడి నష్టం రాకుండా యజమానులకు ముట్టజెప్పడం జరుగుతోందని లీజర్లు ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ పరిధిలోని 20 అడుగుల రోడ్డును కూడా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో రోడ్లు ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. లాడ్జీల్లో అకస్మాత్తుగా ఏమైనా జరగరాని సంఘటనలు జరిగి మంటలు చెలరేగినా కనీసం అంబులెన్స్, ఫైర్ ఇంజన్ లాంటివి రావడానికి కూడా దారి లేని దుస్థితి నెలకొంది. లాడ్జీల నిర్మాణ సమయంలో ఫైర్ స్టేషన్ అనుమతి కూడా తీసుకోవాల్సి ఉంది. మరి అనుమతులు ఉన్నాయా, లేదా అని తెలుసుకునే నాథుడే కరువయ్యారు. రూ.లక్షల్లో, రూ.కోట్లల్లో ఆదాయం పొందుతున్న లాడ్జీల యజమానులు ప్రభుత్వానికి జిఎస్‌టి కూడా కట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక లాడ్జీల్లో విడిది చేసే వారికి కనీసం బిల్లులు కూడా ఇవ్వకుండా 'జీరో' బిజినెస్ చేసి రూ.కోట్లకు పడగలెత్తుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా అటు రెవెన్యూ శాఖ అధికారులు కానీ, ఇటు పోలీసు అధికారులు కానీ ఇలాంటి వాటిపై దృష్టి సారించక పోవడం దురదృష్టకరం. 'జీరో' బిజినెస్ చేసే వ్యాపారుల వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని, ఇప్పటికైనా రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి లాడ్జీల వ్యవహారంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. లాడ్జీల నిర్మాణాలకు కనీస అనుమతులు తీసుకునే విధంగా చర్యలు తీసుకొని ప్రభుత్వ ఆదాయం పెంచుకోవడానికి సహకరించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇరుకు సందుల్లో ఉన్న లాడ్జీలు

మంత్రాలయంలో ఉన్న లాడ్జీలు

21న సర్వసభ్య సమావేశం

- ఎంపిడిఒ రఘునాథ్ గుప్త

ప్రజాశక్తి - కౌతాళం

ఈనెల 21న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ రఘునాథ్ గుప్త తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు అందరూ తప్పకుండా హాజరుకావాలని కోరారు. శాఖ అధికారులు తమ ప్రగతి నివేదికను తప్పకుండా తీసుకోరావాలన్నారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులతో పాటు ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S. No. 297/2023

Y. యల్లరాముడు .... వాది

V/s.

జంగాల లక్ష్మన్న@బి.జె. లక్ష్మన్న
తండ్రి జంగాల బాబయ్య@జె.టి. బాబయ్య
ఇంటి నెం. 13-67, విద్యానగరు, ఇండియన్ గ్యాస్ ఆఫీసు దగ్గర, వెల్దుర్తి (V&M) కర్నూలు జిల్లా.
... ప్రతివాది

దావాసమన్లు

పై నెంబరు దావాలోని వాదిపై ప్రతివాదివి అయిన నీవు ఇవ్వవలసిన ప్రాంసరి బాకి రాబట్టుటకు గాను దావా దాఖలు చేసి వున్నారు. సదరు దావా 26-06-2024న వున్నది. దావా నందు ప్రతివాది పై తేదీన ఉదయం 10-30 గంIIలకు మీరు గాని మీ తరపున వకీలు గారు గానీ హాజరై పై కోర్టు నందు ఆక్షేపణలు తెలియజేసు కొనవచ్చును లేనిచో సదరు దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 26-06-2024

కె. యోగనందారెడ్డి
కె. సత్యనారాయణరెడ్డి
వాదిపరం న్యాయవాదులు
డోన్, నంద్యాల జిల్లా. సెల్ : 9030288570

మహారాజశ్రీ గౌరవనీయులైన డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S. No. 296/2023

మొండి లింగన్న .... వాది

V/s.

జంగాల లక్ష్మన్న@బి.జె. లక్ష్మన్న
తండ్రి జంగాల బాబయ్య@జె.టి. బావయ్య
ఇంటి నెం. 13-67, విద్యానగరు, ఇండియన్ గ్యాస్ ఆఫీసు దగ్గర, వెల్దుర్తి (V&M) కర్నూలు జిల్లా.
... ప్రతివాది

దావాసమన్లు

పై నెంబరు దావాలోని వాదిపై ప్రతివాదివి అయిన నీవు ఇవ్వవలసిన ప్రాంసరి బాకి రాబట్టుటకు గాను దావా దాఖలు చేసి వున్నారు. సదరు దావా 26-06-2024న వున్నది. దావా నందు ప్రతివాది పై తేదీన ఉదయం 10-30 గంIIలకు మీరు గాని మీ తరపున వకీలు గారు గానీ హాజరై పై కోర్టు నందు ఆక్షేపణలు తెలియజేసు కొనవచ్చును లేనిచో సదరు దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 26-06-2024

కె. యోగనందారెడ్డి
కె. సత్యనారాయణరెడ్డి
వాదిపరం న్యాయవాదులు
డోన్, నంద్యాల జిల్లా. సెల్ : 9030288570

యూనియన్ బ్యాంకు నిర్వాహకుని ఖాతా నుంచి రూ.5 లక్షలు చోరీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నిర్వాహకుడు షేక్ ఇబ్రహీం

పట్టణంలోని గాంధీ నగర్‌లో ఉన్న చిన్న పార్కు సమీపంలోని యూనియన్ బ్యాంకు (మినీ బ్యాంకు) నిర్వహిస్తున్న షేక్ ఇబ్రహీం ఖాతా నుంచి రూ.5 లక్షల నగదును సైబర్ నేరగాళ్లు మొబైల్‌ను హ్యాక్ చేసి చోరీకి పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. శనివారం బాధితుడు షేక్ ఇబ్రహీం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి... మండలంలోని కోటేకల్ గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం గాంధీనగర్‌లోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా తరఫున బిజినెస్ కరస్పాండెంట్ కింద బ్యాంకు కార్యకలాపాలు నిర్వహించేవారు. యూనియన్ బ్యాంకులో 189321150000004, మరో ఖాతా 189321010000009 నెంబర్లతో కూడిన ఖాతాను నిర్వహించేవారు. ఈనెల 17న మధ్యాహ్నం 3.12 గంటల నుంచి 3.28 గంటల మధ్య రూ.5 లక్షలు ఫోన్ నెంబర్ హ్యాక్ గురి కావడంతో డబ్బు ఇతర ఖాతాలకు వెళ్లిపోయింది. ఈ డబ్బు హర్యానా, రాజస్తాన్ రాష్ట్రాల్లో ఖాతాలకు మళ్లించబడినట్లు పోలీసులు ధ్రువీకరించారు. షేక్ ఇబ్రహీం మాట్లాడుతూ... మినీ బ్యాంకు నిర్వాహకులు, ఖాతాదారులు జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కేసును దర్యాప్తు చేస్తామనిపట్టణ సిఐ మధుసూదన్ రావు తెలిపారు. ఇప్పటికే ఒక అకౌంట్‌లో ఉన్న మొత్తాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు.

రక్తదానం చేసి ప్రాణదాతలవుదాం

- రక్తదాత వెంకటేష్

ప్రజాశక్తి - ఆదోని

రక్తదానం చేస్తున్న వెంకటేష్

రక్తం అవసరముండి ప్రమాదంలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలవుదామని రక్తదాత వెంకటేష్ తెలిపారు. శనివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మెంబర్స్, జనసేవా సామాజిక సేవా సంస్థ అధ్యక్షులు విరుపాక్షి స్వామి ఆధ్వర్యంలో ఆదోనిలోని తలసేమియా చిన్నారికి 'బి' నెగిటివ్ రక్తదానం చేశారు. ఆయన మాట్లాడుతూ... తలసేమియా పిల్లలకు, గర్భిణులకు, ప్రమాదం జరిగి ఆపదలో ఉన్నవారికి రక్తదానమిచ్చేందుకు యువకులు ముందుకు రావాలని కోరారు.

వైసిపి విజయం తథ్యం

- ఈసీ అనుమతితో రైతులకు పంట నష్ట పరిహారం పంపిణీ
- అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధిపై దృష్టి
- వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజల తీర్పు వైసిపి ప్రభుత్వం వైపు ఉంటుందని, జూన్ 4న వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.బాలనాగిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని రాంపురం గ్రామంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలను డబ్బు రూపంలో లబ్దిదారులకు అందించకుండా టిడిపి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి చెల్లింపులు నిలిపివేసిందని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు చెల్లించాల్సిన పంట నష్టపరిహారం అదే ఎన్నికల సంఘం అనుమతితో చెల్లించినట్లు చెప్పారు. ఎన్నికల ముందు టిడిపి ఎన్ని కుట్రలు చేసినా ప్రజలంతా వైసిపి వైపే నిలిచారని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాల అమలుతో పాటు నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారిస్తామని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్ల నేపథ్యంలో నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలను ఎవరైనా రెచ్చగొట్టినా సంయమనం పాటించాలని సూచించారు. మంత్రాలయం మండలంలో 11,755 మంది రైతులకు రూ.14.44 కోట్లు, కోసిగిలోని 12,230 రైతులకు రూ.15.84 కోట్లు, కౌతాళంలోని 17,882 మంది రైతులకు రూ.27.45 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. అంతకు ముందు తుంగభద్ర గ్రామంలో వెలసిన శ్రీకన్యాకపరమేశ్వరి జయంతి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, రైతులు ఉన్నారు.

మాట్లాడుతున్న బాలనాగిరెడ్డి

మహారాజశ్రీ గౌరవనీయులైన డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A. No. 552/2023 in O.S. No. 297/2023

Y. యల్లరాముడు .... అర్జీదారు

V/s.

జంగాల లక్ష్మన్న@బి.జె. లక్ష్మన్న
తండ్రి జంగాల బాబయ్య@జె.టి. బాబయ్య
ఇంటి నెం. 13-67, విద్యానగరు, ఇండియన్ గ్యాస్ ఆఫీసు దగ్గర, వెల్దుర్తి (V&M) కర్నూలు జిల్లా.
... రెస్పాండెంటు

నోటీసు

సదరు నెంబరులోని అర్జీదారు రెస్పాండెంట్ అయిన మీ పై ప్రాంసరి నోటు బాకీ నిమిత్తము రాబట్టుకొనుటకై మీ యొక్క స్థిరాస్తిని అటాచ్‌మెంట్ కోరి దావా మోషన్ దాఖలు చేసియున్నాడు. ఈ విషయ మై మీకు ఆక్షేపణలు వున్న ఎడల 26-06-2024వ తేదీన ఉదయం 10:30 గంIIలకు పై కోర్టు వారి ఎదుట మీరు గాని మీ తరపున వకీలు ద్వారా గాని పై కోర్టులో మీరు హాజరై పై కోర్టు వారితో ఆక్షేపణలు తెలియజేయవలెను. అట్లు లేని యెడల సదరు విషయమై నీ పరోక్షముగా విచారించి తీర్మానము చేయబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 26-06-2024

కె. యోగనందారెడ్డి
కె. సత్యనారాయణరెడ్డి
అర్జీదారుపరం అడ్వకేటు,
డోన్, నంద్యాల జిల్లా.
సెల్ : 9030288570

నేటి నుంచి ఖాదర్ లింగ స్వామి ఉరుసు

ప్రజాశక్తి - కౌతాళం

ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు మండల కేంద్రమైన కౌతాళంలో వెలిసిన శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి ఉరుసు ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతున్నట్లు దర్గా ధర్మకర్త మున్నా పాషా చిస్తి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన పుణ్యక్షేత్రం శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గా క్షేత్రమని తెలిపారు. ఆదివారం స్వామి వారి సమాధిని సుగంధ ద్రవ్యాలతో గుసుల్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం పుష్ప గుచ్ఛాలతో స్వామివారి సమాధిని అలంకరించి శిష్య బృందం ఆధ్వర్యంలో గంధోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఉరుసు ఉత్సవాలు భక్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. ఈ ఉరుసు ఉత్సవాలకు రాష్ట్రం నుంచే కాక కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల నుంచి, వివిధ దేశాల నుంచి భక్తులు పాల్గొంటారని తెలిపారు. ఆదోని, సిరుగుప్ప, బళ్లారి, రాయచూర్, మాన్వి పట్టణాల నుంచి భక్తులకు ఆర్‌టిసి వారు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవాలకు పంచాయతీ అధికారులతో పాటు ఆర్‌టిసి, విద్యుత్, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు సహకరించాలని కోరారు. పీఠాధిపతి ఖాదర్ బాషా చిస్తి పాల్గొన్నారు.

దర్గా ధర్మకర్త మున్నా పాషా చిస్తి

పైకి గాంభీర్యం.. లోలోన భయం...

- గెలుపుపై ఎవరి అంచనాలు వారివే

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత అభ్యర్థులకు గుబులు పట్టుకుంది. ఓట్ల లెక్కింపునకు 17 రోజుల గడువు ఉంది. ఉమ్మడి కూటమి, వైసిపి, కాంగ్రెస్ నేతలు ఎవరి అంచనాల్లో వారు ఉన్నారు. ఇరు పార్టీల నేతలు 'గెలుపు మాదంటే మాది' అంటూ పైకి గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. లోలోన మాత్రం వారిలో భయం వెంటాడుతోంది. పైకి మాత్రం కనీసం 5 నుంచి 10 వేల మెజార్టీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అంతర్గతంగా మాత్రం కనీసం 5 వేలలోపు అయినా గెలవలేక పోతామా? అనుకుంటూ లెక్కలు వేస్తున్నారు. ఇప్పటికే మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వై.సాయిప్రసాద్ రెడ్డి, ఉమ్మడి కూటమి అభ్యర్థిగా పార్థసారథి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రమేష్ యాదవ్ బరిలో నిలిచారు. నియోజకవర్గ ఓటర్లు ఎవరికి పట్టం కడతారో వేచి చూడాలి మరి...

ఎవరి 'లెక్క'లు వారివే..

పోలింగ్‌కు ముందు ప్రచారం, అందరినీ సమన్వయం చేసుకోవడంలో ఊపిరి సలపకుండా గడిపారు. తర్వాత వార్డులు వారీగా, పంచాయతీల వారీగా ఆయా బూత్‌లలో ఎంత పోలింగ్ శాతం అయింది, ఎన్ని ఓట్లు వస్తాయని లెక్కలు వేసుకుంటున్నారు. బరిలో నిలిచిన నేతలే కాదు.. వారి అనుచర గణం కూడా ఎక్కడ పిచ్చాపాటి కబుర్లు ప్రారంభించినా ఎవరు గెలుస్తారనే మాటలతో ప్రారంభమై ఎంత మెజార్టీ అని చర్చలు జరుపుకొంటున్నారు.

పెరిగిన పోలింగ్ అనుకూలమేనా..?

నియోజకవర్గంలో 2019లో 65.4 శాతం పోలింగ్ నమోదయింది. 2024 ఎన్నికల్లో 65.47 శాతానికి చేరుకుంది. గత ఎన్నికల కంటే ఈ ఏడాది 0.7 శాతం పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతోనే భారీగా పోలింగ్ జరిగిందని గెలుపుపై ధీమా పెంచుకుంటున్నారు. మునుపెన్నడూ లేని విధంగా యువత, ఉద్యోగులు, మహిళలు, ఉద్యోగులు కూటమికి ఓటు వేశారని చెబుతున్నారు. వైసిపి వర్గాల్లో ఓవైపు వ్యతిరేక ఓట్లు అనుకుంటూనే ప్రభుత్వ సానుకూలత అంటూ చెప్పుకొస్తున్నారు. ఇరు పార్టీల నేతలు, శ్రేణులు విజయంపై ఓ పట్టాన అంచనాకు రాలేక పోతున్నారు. ఈ ఫలితాలపై జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే...

రూ.16.34 కోట్ల పరిహారం జమ

- ఎఒ వరప్రసాద్

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని 15,674 మంది రైతులకు రూ.16.34 కోట్ల నష్టపరిహారం జమ చేసినట్లు ఎఒ వరప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 2023 ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వివిధ రకాలైన పంటలు వర్షాభావ పరిస్థితులతో దెబ్బతిన్నాయని చెప్పారు. 9,804.924 హెక్టార్లలో వివిధ రకాల పంటలు వర్షాభావ పరిస్థితులతో దెబ్బతిని రైతులు అపారంగా నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వం 15,674 మంది రైతులకు రూ.16,34,16,218 నష్టపరిహారం కింద రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు వెల్లడించారు. పత్తి 5,785.72 హెక్టార్లలో 8,083 మంది రైతులకు రూ.9,83,57,240, మిరప 3,141.284 హెక్టార్లలో 5,619 మంది రైతులకు రూ.5,34,01,828, వేరుశనగ 426.63 హెక్టార్లలో 761 మంది రైతులకు రూ.72,52,710, ఆముదం 230.16 హెక్టార్లలో 388 మంది రైతులకు రూ.19,56,360, కంది 97.24 హెక్టార్లలో 509 మంది రైతులకు రూ.9,72,400 జమ చేసిందన్నారు. అలాగే ఉల్లి 36.49 హెక్టార్లలో 85 మందికి రూ.6,20,330, సజ్జలు 41.06 హెక్టార్లలో 112 మందికి రూ.3,49,010, కొర్ర 21.42 హెక్టార్లలో 48 మందికి రూ.1,82,070, మొక్కజొన్న 11.41 హెక్టార్లలో 17 మందికి రూ.1,72,625, వరి 5.6 హెక్టార్లలో 19 మందికి రూ.95,200, జొన్న 5.48 హెక్టార్లలో 23 మందికి రూ.46,580, టమోటా 2.26 హెక్టార్లలో 8 మందికి రూ.38,420, నువ్వులు 0.17 హెక్టార్లలో ఇద్దరికి రూ.1,445 జమ అయినట్లు తెలిపారు.

విద్యుత్ ఎడిఇ నాగేంద్ర ప్రసాద్‌పై వేటు

ప్రజాశక్తి - ఆలూరు

విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఆలూరు విద్యుత్ ఎడిఇ నాగేంద్రప్రసాద్‌పై సస్పెన్షన్ వేటు పడినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ రాజేష్ శనివారం తెలిపారు. కొన్నిరోజులుగా హాలహర్వి, హొళగుంద మండలాల్లోని విద్యుత్ శాఖలో జరిగిన పరిణామాలు, అవినీతిపై జిల్లా ఉన్నతాధికారి ఆకస్మికంగా తనిఖీ చేయడంతో వెలుగులోకి వచ్చిన సంఘటనలపై విచారించి సస్పెన్షన్ చేసినట్లు తెలిపారు.

ఈరన్న స్వామి హుండీ లెక్కింపు

- ఆదాయం రూ.72,92,228

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి హుండీ ఆదాయం రూ.72,92,228 వచ్చిందని దేవస్థానం డిప్యూటీ కమిషనర్, కార్య నిర్వహణ అధికారి హెచ్‌జి.వెంకటేష్ తెలిపారు. శనివారం స్వామివారి హుండీని లెక్కించినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వామివారికి ఈ నగదుతో పాటు బంగారం 66 గ్రాముల 700 మిల్లీగ్రాములు, వెండి 13 కిలోల 600 గ్రాములు భక్తులు సమర్పించుకున్నారని తెలిపారు. హుండీ పర్యవేక్షణ అధికారి ఎస్.వెంకటేష్, దేవస్థాన పర్యవేక్షకులు మల్లికార్జున, రామ్మోహన్, వెంకటేష్, దేవాలయ సిబ్బంది, పాలకమండలి సభ్యులు, కౌతాళం పోలీసు సిబ్బంది, శ్రీభ్రమరాంబ సేవసమితి ఆదోని వారు పాల్గొన్నారు.

లెక్కింపులో పాల్గొన్న అధికారులు

రాయితీ వేరుశనగ విత్తనాల సరఫరా

- రిజిస్ట్రేషన్ చేసుకోండి - ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఎఒ హేమలత

ప్రజాశక్తి-గోనెగండ్ల

మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

ఖరీఫ్-2024కు సంబంధించి వేరుశనగ విత్తనాలను ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తుందని ఎమ్మిగనూరు ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, గోనెగండ్ల ఎఒ హేమలత తెలిపారు. శనివారం వారు మాట్లాడారు. ఈనెల 20 నుంచి సమీపంలోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. గోనెగండ్ల మండలానికి 275 క్వింటాళ్ల విత్తనాలు మంజూరయ్యాయని చెప్పారు. క్వింటా పూర్తి ధర రూ.9,500 కాగా, 40 శాతం రాయితీ రూ.3,800 పోను రైతు వాటాగా రూ.5,700 చెల్లించాలని తెలిపారు. వేరుశనగ విత్తనాలు కావాల్సిన రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించాలన్నారు.

దేవనకొండ : ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న వేరుశనగ విత్తనాల కోసం మండలంలోని వివిధ గ్రామాల రైతులు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎఒ సురేష్ బాబు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 20 నుంచి ప్రతి ఆర్‌బికెలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. ఒక క్వింటా వేరుశనగ విత్తనాలు రూ.9,500 ఉందని, 40 శాతం రాయితీ కింద విత్తనాలు అందించనున్నట్లు తెలిపారు. రైతులు రూ.5,700 చెల్లించాలని, రూ.3,800 రాయితీ కింద పోతుందని చెప్పారు. రైతులు ఆర్‌బికెలో ఆధార్ కార్డు, పాస్ పుస్తకం, ఫోన్ నెంబర్స్ తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రైతులను కోరారు.

వైభవంగా వాసవి దేవి జయంతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ప్రత్యేక అలంకారంలో ఉన్న అమ్మవారు

పట్టణంలోని నగరేశ్వర స్వామి ఆలయంలో వాసవి దేవి జయంతి పూజలు శనివారం వైభవంగా జరిగాయి. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. 108 కలశాలతో ఆర్యవైశ్య మహిళా విభాగం సభ్యులు పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, హోమ పూజలు నిర్వహించి భక్తులకు అన్నసంతర్పణ చేశారు. సంఘ పెద్దలు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A. No. 555/2023 in O.S. No. 296/2023

మొండి లింగన్న .... అర్జీదారు

V/s.

జంగాల లక్ష్మన్న@బి.జె. లక్ష్మన్న
తండ్రి జంగాల బాబయ్య@జె.టి. బావయ్య
ఇంటి నెం. 13-67, విద్యానగరు, ఇండియన్ గ్యాస్ ఆఫీసు దగ్గర, వెల్దుర్తి (V&M) కర్నూలు జిల్లా.
... రెస్పాండెంటు

నోటీసు

సదరు నెంబరులోని అర్జీదారు రెస్పాండెంట్ అయిన మీ పై ప్రాంసరి నోటు బాకీ నిమిత్తము రాబట్టుకొనుటకై మీ యొక్క స్థిరాస్తిని అటాచ్‌మెంట్ కోరి దావా మోషన్ దాఖలు చేసియున్నాడు. ఈ విషయ మై మీకు ఆక్షేపణలు వున్న ఎడల 26-06-2024వ తేదీన ఉదయం 10:30 గంIIలకు పై కోర్టు వారి ఎదుట మీరు గాని మీ తరపున వకీలు ద్వారా గాని పై కోర్టులో మీరు హాజరై పై కోర్టు వారితో ఆక్షేపణలు తెలియజేయవలెను. అట్లు లేని యెడల సదరు విషయమై నీ పరోక్షముగా విచారించి తీర్మానము చేయబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 26-06-2024

కె. యోగనందారెడ్డి
కె. సత్యనారాయణరెడ్డి
అర్జీదారుపరం అడ్వకేటు,
డోన్, నంద్యాల జిల్లా.
సెల్ : 9030288570